క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన ఉల్లెంగుల రాజేశ్వర్ రెండేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమయ్యాడు. అతడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వైద్యం, కుటుంబపోషణకు వారు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న నిర్మల్‌లోని నవీన్ గోల్డ్ దుకాణ యజమాని నవీన్ రూ.10వేల ఆర్థికసాయం బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో తునికి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి సాయం

కడెం: మండలంలోని కొత్తమద్దిపడగ గ్రామంలో పేద కుటుంబానికి చెందిన నాంపల్లి మల్లేశ్ రోడ్డు ప్రమాదంలో గాయపడి.. దాతల సాయంతో ఇటీవల ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకున్నాడు. అతడికి ఫిజియోథెరపి నిమిత్తం మండలంలోని అంబారిపేట్‌కు చెందిన మాధవ సేవే మానవసేవ స్వచ్ఛంద సంస్థ సభ్యుడు ఎన్ఆర్ఐ శేట్పల్లి మహేశ్ ఆదివారం రూ.ఐదు వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పవన్, నితిశ్, సాయి, శివ, చందు తదితరులు ఉన్నారు.

బడుగుల ఆశాజ్యోతి సాఠే



జెండా ఆవిష్కరిస్తున్న బాలేరావు, నేతలు

కుంటాల: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అన్నాభావు సాఠే అని అన్నాభావు సాఠే కమిటీ తాలుకా అధ్యక్షుడు ఉత్తం బాలేరావ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఓ లాలో అన్నాభావు సాఠే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి విగ్రహానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరించారు. సర్పంచ్ కనీస్ ఫాతిమా, హైమద్ పాషా, డైరెక్టర్లు గజ్జారాం, దిగంబర్, సాయినాథ్, సురేఖ., అనిల్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాత్రలు పంపిణీ

ముధోల్: వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ముధోల్‌లో బోదకాల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఇంటింటికీ తిరుగుతూ వ్యాధి నివారణ మాత్రలు వేశారు.

మొక్కలు నాటి సంరక్షించండి



మొక్కలు నాటుతున్న నాయకులు

లోకేశ్వరం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని వైస్ ఎంపీపీ మామిడి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ధర్మోర గురెడికాపు సంఘ భవనం ఆవరణలో మొక్కలను నాటారు. గురెడి కాపు సంఘం సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, భోజారెడ్డి, హన్మంత్‌రెడ్డి, లచ్చిరెడ్డి, సాయారెడ్డి, నరేందర్, సునీల్‌రెడ్డి, గంగారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ధర్మారెడ్డి, సంజీవ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నర్సారెడ్డి, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి జాతర



దర్శించుకుంటున్న భక్తులు

మామడ: మండలంలోని కొరిటికల్ గ్రామంలో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజైన ఆదివారం వేదపండితులు ఆలయంలో గణపతిపూజ, గోపూజ, విశ్వక్‌సేనారాధన, అగ్నిప్రతిష్ఠ, ధ్వజ రో హ ణం, సుదర్శనహోమం, సామూహిక కుంకుమార్చనలు చేశారు. సోమవారం స్వామివారి కల్యాణం, రథోత్సవం, అన్నదానం నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని గాంధీనగర్ శివారులో నల్ల పోచమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించా రు. అర్చకులు బి.ఈశ్వరాచారి ఆధ్వర్యంలో నవగ్రహపూజ, గణపతిపూజ, లక్ష్మిగణపతిపూజ, రుద్రహోమం, పూర్ణాహుతి, తదితర పూజా పూజాకార్యక్రమాలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బక్కశెట్టి లక్ష్మణ్, బీసీ రాజన్న, కావలి సంతోష్, సిరిపురం నాగరాజు, అశోక్‌రావు, రాములు, నర్సింలు, సత్యం, శివ, నాగరాజు, రవీందర్, కుమార్ తదితరులు ఉన్నారు.

వీధి కుక్కలున్నాయ్.. జాగ్రత్త!

- ప్రజలు, పశువులపై దాడులు చేస్తున్న గ్రామసింహాలు
- బయటకు వచ్చేందుకు జంకుతున్న జనం
- పట్టించుకోని అధికారులు
- నివారణ చర్యలు చేపట్టాలని వేడుకోలు



సింగన్‌గాంలో కుక్కల దాడిలో గాయపడ్డ చిన్నారి



ఎల్విలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

తానూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఊరకుక్కల బెడద ఎక్కువైంది. ఒకప్పుడు కొత్తవారిని చూసి మొరిగే వీధి కుక్కలు.. నేడు స్థానికులపైనే దాడులు చేస్తున్నాయి. దీంతో వారు తమ ఇంటి నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. గుంపులు గుంపులుగా సంచరిస్తూ పశువులు, ప్రజల వెంట పడుతుండటంతో కొందరు కుక్కకాటుకు బలవుతున్నారు. రోడ్డు పక్కన పొదల్లో ఉంటూ ఒక్కసారిగా మీదకు రావడంతో ద్విచక్ర వాహనదారులు సైతం భయంతో కింద పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద నివారించేందుకు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.

దడ పుటిస్తున్న గ్రామసింహాలు..

తానూరు మండలంలోని గ్రామాల్లో వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగింది. బడికి వెళ్లే విద్యార్థులు, పనులకు వెళ్లే పెద్దలతోపాటు ద్విచక్ర వాహనదారుల వెంట పడుతూ గాయపరుస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతూ పశువులపై కూడా దాడులు చేస్తున్నాయి. మండలంలోని ఎల్వి, ఉమ్రి(కే), బెల్‌తరోడా, తానూరు, ఝరి(బి), బోరిగాం, బెంబర, బోల్సా, సింగన్‌గాం, భోసి, మహలింగి, బామ్ని తదితర గ్రామాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది.

- ఆరు నెలల కిందట మండలంలోని సింగన్‌గాంలో వీధిలో ఆడుకుంటున్న చిన్నారి రితేశ్‌పై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబసభ్యులు అప్రమత్తమై నిజామాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. బోల్సా, బోరిగాం, ఉమ్రి(కే) గ్రామాల్లోనూ పశువులపై దాడులకు తెగబడుతున్నాయి.
- మూడు నెలల కిందట బోరిగాం గ్రామ సమీపంలో కుక్కలు అడ్డురావడంతో బైక్‌పై వెళ్తున్న మహారాష్ట్రలోని జున్నికి చెందిన ఇద్దరు అదుపు తప్పి కిందపడ్డారు. వారికి గాయాలయ్యాయి.
- గత నెలలో బోల్సా గ్రామ సమీపంలో కుక్కలు అడ్డు రావడంతో ధర్మాబాద్‌కు చెందిన వాహనదారుడు ప్రమాదానికి గురయ్యాడు.

సమస్య పరిష్కరించాలి..

బడికి వెళ్లి వచ్చేటప్పుడు విద్యార్థులు.. వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లే పెద్దలు సైతం ఏయే దిక్కు నుంచి కుక్కలు వస్తాయోనని భయాందోళన చెందుతున్నారు. మరికొందరు కుక్కకాటుకు గురవక ముందే అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

కుక్కల బెడద నివారించండి



గ్రామాల్లో విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కల బెడదను నివారించండి. పశువులను కరుస్తున్నాయి. రోడ్ల వెంట రా వాలంటేనే భయంగా ఉంది. అధికారులు వెంటనే సమస్య పరిష్కరించాలి. – మహేశ్, ఎల్వి గ్రామస్తుడు

పాఠశాలకు పంపాలంటే భయం



వీధుల్లో కుక్కలు తిరగుతుండంతో పిల్లలను పాఠశాలకు పంపాలంటేనే భయమేస్తోంది. గుంపులు గుంపులుగా ఎక్కడి నుంచో వచ్చి దాడి చేస్తాయని భయం వేస్తోంది. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. – పోతన్న ,ఉమ్రి(కే) గ్రామస్తుడు

అటెన్షన్ ప్లీజ్.. గుంతతో ముప్పు



లోకేశ్వరం: భారీ వర్షాలకు వరదలు రావడంతో మండలంలోని సాథ్‌గాం నుంచి పెండ్‌పల్లి వెళ్లే రోడ్డు మార్గంలో సుద్దవాగు వంతెన వద్ద కల్వర్టు పక్కన పెద్ద గుంత ఏర్పడింది. చుట్టూ పొదలు ఉండటంతో దగ్గరకు వచ్చేవరకు గుంత తెలియడం లేదు. వాహనదారులు అందులో పడిపోక ముందే గుంతను పూడ్చివేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: రఘువంశీ, పీఆర్ ఏఈ, ఫోన్ 95506 07360

సర్వాయి పాపన్నకు నివాళి



పూలమాలలు వేస్తున్న గౌడ సంఘం నాయకులు



కుభీర్‌లో..

భైంసారూరల్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గౌడ సంఘం నాయకులు మురళీగౌడ్ అన్నారు. ఆదివారం భైంసా పట్టణంలోని రాహుల్‌నగర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడసంఘం నాయకులు రమేశ్‌గౌడ్, అశోక్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాజు గౌ డ్, అమర్‌గౌడ్, సురేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కుభీర్:మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ యువత పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తి ని ఆదర్శంగా తీసుకొని బహుజనుల హక్కుల కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పీరాజీ, విజయ్, అనిల్, నాగలింగం, కనకాగౌడ్ తదితరులు ఉన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి



ఖానాపూర్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



నిర్మల్‌లో పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నేతలు



కడెంలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఖానాపూర్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశానికి అందించిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్ చౌరస్తాలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చిన్నం సత్యం, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేష్, గంగనర్సయ్య, జహీర్ అహ్మద్, నేతశ్యాం, సలీంఖాన్, రవి, షౌకత్‌పాషా, శ్రీనివాస్, ఆరిఫ్ తదితరులు ఉన్నారు.

డీసీసీ అధ్యక్షుడి నివాసంలో..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు నివాసంలో మాజీ ప్రధాని, దివంగత రాజీవ్ గాంధీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీనవర్గాల కోసం ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికీ ప్రజల మన్ననలు పొందుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కడెం: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం రాజీవ్‌గాంధీ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు తుమ్మల మల్లేశ్, రఫీక్, భూషణం, చాంద్‌పాషా, బ్రహ్మాచారి, ధర్మయ్య తదితరులు ఉన్నారు.

'ఏలేటి' ఆరోగ్యం బాగుండాలని పూజలు



దిలావర్‌పూర్‌లో పూజలు చేస్తున్న బీజేపీ నేతలు



అడెల్లిలో పూజలు చేస్తున్న నాయకులు

దిలావర్‌పూర్: మాస్టర్ ప్లాన్ రద్దుకు దీక్ష చేస్తున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోగ్యం బాగుండాలని మండల కేంద్రంలోని ఏకనాథుడి ఆలయంలో బీజేపీ నాయకులు అభిషేకాలు, అర్చనలు, పూజలు చేశారు. ఇందులో బీజేపీ మండలాధ్యక్షుడు పీసరి శైలేశ్వర్, సబ్బని మురళి, భోజరాం, ప్రవీణ్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సోన్: నిర్మల్ మాస్టర్‌ప్లాన్ రద్దు చేయాలని ఆమరణ దీక్ష చేస్తున్న బీజేపీ నాయకులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోగ్యం బాగుండాలని కోరుతూ మండలంలోని జాఫ్రపూర్ హనుమాన్ ఆలయంలో ఎంపీపీ మానస రెడ్డి పూజలు చేశారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సారంగపూర్: మాస్టర్ ప్లాన్ రద్దు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మహేశ్వర్‌రెడ్డి ఆరోగ్యంగా ఉండాలని బీజేపీ నాయకులు మండలంలోని అడెల్లిలో పూజలు చేశారు. అడెల్లి పోచమ్మ ఆలయంలో సారంగాపూర్ ఎంపీటీసీ సామల పద్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరయ్య, తేఖర్ గౌడ్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు



లక్ష్మణచాంద పోలీస్‌స్టేషన్ వద్ద నేతలు



మామడలో అరెస్టయిన నాయకులు

లక్ష్మణచాంద: జిల్లా కేంద్రంలో మంత్రి ఐకేరెడ్డి ఇంటిని ముట్టడిస్తారనే సమాచారంతో మండలంలోని పలువురు బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బీజేపీ మండలాధ్యక్షుడు గోవర్ధన్, ఉపాధ్యక్షుడు రంజిత్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు రాపని గంగాధర్, బూత్ అధ్యక్షుడు పుట్టి గంగాధర్ తదితరులు ఉన్నారు.

మామడ: నిర్మల్ మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని దీక్ష చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి సంఘీభావం తెలిపేందుకు జిల్లా కేంద్రం వెళ్తున్న బీజేపీ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈసందర్భంగా బీజేపీ మండల కన్వీనర్ కొరిపెల్లి లింగారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి లింగారెడ్డి, నాయకులు లింగం యాదవ్, రాములు, భాస్కర్, సీతారాంలను ఆదివారం పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ రద్దు అయ్యే వరకు ఆందోళన సాగిస్తామని పేర్కొన్నారు.

నర్సాపూర్(జి): మహేశ్వర్‌రెడ్డి ఆమరణ నిరాహారదీక్షకు వెళ్లకుండా ఆదివారం ఉదయం మండలంలోని బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు అర్జున్, జిల్లా కార్యదర్శి రాజేందర్, నరేందర్, సాయికృష్ణ, శ్రీధర్, ప్రశాంత్, లక్ష్మణ్ ఉన్నారు.

సారంగపూర్: నిర్మల్‌లో మహేశ్వర్‌రెడ్డి చేపట్టిన దీక్ష వద్దకు వెళ్లకుండా మండలంలోని బీజేపీ నాయకులను ఆదివారం తెల్లవారుజామున సారంగాపూర్ ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో సామల వీరయ్య, రాథోడ్ నారాయణ, రాథోడ్ ప్రకాశ్, జాదవ్ వినోద్, కాల్వ నరేశ్ తదితరులు ఉన్నారు.

'మంత్రి తలసానిపై చర్యలు తీసుకోవాలి'

నిర్మల్‌ఖిల్లా: హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు, గిరిజననేత రాజేశ్ బాబును పక్కకు నెట్టివేసి అతడిపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేయి చేసుకోవడం హేయమైన చర్య అని జిల్లాకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు విమర్శించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో వారు మాట్లాడారు. ఉద్యమ నాయకులను అగౌరవపరచడం సరికాదని.. మంత్రిపై వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది అల్లూరి మల్లారెడ్డి, ఉద్యమకారులు సాదు రాంరెడ్డి, గోపి గంగయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ముధోల్: హైదరాబాద్‌లో బ్రిడ్జి ప్రారంభోత్సవానికి హాజరైన భైంసా మార్కెట్ క మి టీ చైర్మన్‌ను నెట్టేసి చెంప దెబ్బ కొట్టిన మంత్రి తలసానిశ్రీనివాస్ ప్రవర్తనను ఖండిస్తున్నామని బంజార సంఘం జిల్లా నాయకులు నరేందర్ రాథోడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. అధిష్ఠానం మంత్రిపై చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. లేకుంటే బంజార సమాజం తగు రీతిలో స్పందిస్తుందని హెచ్చరించారు.

ఉద్యమకారుడిపై దాడి హేయనీయం

కుంటాల: ఉద్యమకారుడు, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్‌బాబుపై దాడి హేయనీయమైన చర్యని మాజీ సర్పంచ్ జుట్టు మహేందర్ అన్నారు. ఆదివారం కుంటాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబైన నాగదేవత ఆలయాలు

- ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ సభ్యులు



నిర్మల్‌లో నాగదేవత ఆలయం

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని శ్రీ గండి రామన్న దత్తసాయి ఆలయ క్షేత్రం ముస్తాబైంది. సోమవారం నాగుల పంచమి నేపథ్యంలో పరిసరాలను శుభ్రం చేసి అమ్మవారి ప్రతిమకు రంగులు వేయించారు. ఏటా పండుగ రోజు భక్తులు పుట్టలో నాగదేవతకు పాలు పోసి మొక్కులు చెల్లించుకోడం ఆనవాయితీ. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ట్రస్ట్ చైర్మన్ లక్కడి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.

భైంసారూరల్: నాగుల పంచమి నేపథ్యంలో మండలంలోని మాంజ్రి, సిరాల, సుంక్లి, చుచుంద్, వానల్‌పాడ్, ఇలేగాం గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఇప్పటికే ఏర్పాట్లు జరుగుతున్నాయి. భోకర్ జాతీయ రహదారిపై మాంజ్రి గ్రామం వద్ద నాగదేవత ఆలయానికి ఏటా భక్తులు భారీగా తరలి వస్తుంటారు. ఆలయ ప్రాంగణంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. పూజల అనంతరం పుట్టింటికి వచ్చిన ఆడబిడ్డలకు కొత్తబట్టలు పెట్టి కానుకలు అందించడం ఆనవాయితీ.

జీయర్ గురుకులంలో వైద్యశిబిరం



మాట్లాడుతున్న స్వామీజీ

కడెం: మండలంలోని కొండుకూర్ గ్రామానికి చెందిన కొల్లూరి శ్రీనివాస్, చంద్రహాస్ ఆధ్వర్యంలో ఇదే మండలంలోని అల్లంపల్లి జీయర్ గురుకులంలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ఆదిలాబాద్ డెంటల్ అసోసియేషన్ వైద్యులు రామకృష్ణ, ప్రమోద్‌రెడ్డి అమూల్య, సాయిరాం హాజరై విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారికి టూత్ బ్రష్‌లు, మందులు అందించారు. గురుకులం స్వామీజీ శాంతరాం వైద్యులు, నిర్వాహకులను సత్కరించారు. కార్యక్రమంలో పీవీ రావు, రాజేశ్, గురుకులం ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎల్ఓసీ అందజేత

కుంటాల: మండలంలోని లింబా(కె) గ్రామంలో పేద కుటుంబానికి చెందిన మోరేకర్ రమేశ్ గుండె ఆపరేషన్‌కు అవసరమయ్యే రూ.2.50 లక్షల విలువైన ఎల్ఓసీని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మంజూరు చేశారు. ఆదివారం ఎల్‌వోసీని బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంసభ్యులకు అందజేశారు. సర్పంచ్ ఆనంద్‌రావు, ఆత్మ మాజీ చైర్మన్ అశోక్, ఎంపీటీసీ సునంద గిరీశ్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సన్మానం

నర్సాపూర్(జి): స్వాతంత్ర్య దినోత్సవం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ పంచాయతీగా నర్సాపూర్(జి) గ్రామ సర్పంచ్ రాంరెడ్డి అవార్డు అందుకున్నారు. ఆదివారం సర్పంచ్‌ను గాయత్రి స్కూల్ డైరెక్టర్లు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. గాయత్రి స్కూల్ డైరెక్టర్లు గణేశ్, వెంకటేశ్, గజేందర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

కుంటాల: స్వాతంత్ర్య దినోత్సవం రోజున కుంటాల ఎస్సై హన్మాండ్లు మంత్రి ఐకేరెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ ఎస్సైగా పురస్కారం అందుకున్నారు. ఆయనను ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పీఆర్టీయూ నాయకులు సన్మానించారు. పీఆర్టీయూ నాయకులు సక్రపు గజేందర్, సోమేశ్వర్, సబ్బిడి నర్సయ్య, నారాయణ, తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'తప్పుడు వార్తతో సంబంధం లేదు'

తానూరు: గత వారం రోజులుగా ముధోల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్ తనకు ఇవ్వాలని అడుగుతున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తమని.. అలాంటి తప్పుడు వార్తలతో తనకెలాంటి సంబంధం లేదని మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొందరు కావాలనే తాను ముధోల్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్నట్లు తప్పుడు వార్త రాస్తున్నారన్నారు. బీఆర్ఎస్ టికెట్ ఎమ్మెల్యేకే వస్తుందని.. ఆయన గెలుపునకు పని చేస్తామని పేర్కొన్నారు.

సాధనశూరుల ప్రదర్శన

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం తిమ్మాపూర్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సాధనశూరుల ప్రదర్శన ఆకట్టుకుంది. వారు ప్రదర్శించిన గారడీ, ఇతర నైపుణ్యాలు వీక్షకులను అలరించాయి. ఏటా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శన చేపట్టడం ఆనవాయితీగా వస్తోందని సంఘం సభ్యులు తెలిపారు. గజ్జరాం నర్సయ్య, నడిమట్ల రమేశ్, అడ్డగట్ల రాజన్న, రాజేశ్వర్, రాజమొగిలి, మహేందర్, భీమన్న, అంజన్న, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

నేడు పంపిణీ

ముధోల్: బీసీ కులవృత్తులకు అందిస్తున్న రూ.లక్ష రుణసాయం చెక్కులను సోమవా రం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని ఎంపీడీవో సురేశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ముధోల్ క్యాంపు కార్యాలయంలో మధ్యాహ్నం అందిస్తారని వారు పేర్కొన్నారు.